క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం


సత్తుపల్లి ఆర్టీసీ డీఎం యు.రాజ్యలక్ష్మి

మధిర/సత్తుపల్లి టౌన్: మధిర, సత్తుపల్లిలోని ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలు పరిష్కరించేందుకు శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని సత్తుపల్లి, మధిర ఆర్టీసీ డీఎంలు యు.రాజ్యలక్ష్మి, డి.శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధిర ఆర్టీసీ ప్రయాణికులు 9959225961, సత్తుపల్లి ప్రయాణికులు 9959225962 నంబర్లకు ఫోన్ చేసి సమస్యలను డీఎం దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక


ఎంపికైన గురుకుల విద్యార్థులు

ఏన్కూరు: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ టెన్నికాయిట్‌కు ఏన్కూరు గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. 9వ తరగతి చదువుతున్న ఏయోగేంద్రవర్మ, ఏ యోగేష్‌లు ఎంపికయ్యారు. ఈ నెల 29న ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందారు. ఇద్దరు సెప్టెంబర్ 1న నిజాంబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై న విద్యార్థులను ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి, పీఈటీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

తల్లాడ: అటవీ కళాశాల, పరిశోధన సంస్థలో విద్యనభ్యసిస్తున్న తల్లాడ మండలం మిట్టపల్లి విద్యార్థి పడిగల రాకేష్ డిస్కస్ త్రోలో రాణించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచాడు. శుక్రవారం సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ అసోషియేషన్ నిర్వహించిన పోటీల్లో డిస్కస్ త్రోలో రాకేష్ ప్రథమ స్థానంలో నిలవడంతో నిర్వాహకులు రాకేష్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. దీంతో రాకేష్‌ను మిట్టపల్లిలో పలువురు ప్రముఖులు అభినందించారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ


చెక్కులు అందిస్తున్న వెంకటేశ్వర్లు

చింతకాని: మండలంలోని నాగులవంచలో లబ్ధిదారులకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న నాగులవంచ గ్రామానికి చెందిన ఉప్పు నాగమణి, జొన్నలగడ్డ రేణుక, సిలివేరు రమాదేవి, షేక్ జాన్ సాహెబ్, యరదేశి గోపాలరావు లకు వైద్య ఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బస్వయ్య, వీరభద్రం, వెంకటేశ్వర్లు, రమేష్, నాగయ్య, చిన్న అప్పారావు, మంగారావు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

టీజేఎస్ రాష్ట్ర ప్లీనరీని జయప్రదం చేయండి

ఏన్కూరు: సెప్టెంబర్ 30న హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్లీనరీని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ వడ్డేబోయిన బాబు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన టీజేఎస్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో సెప్టెంబర్ 10 నుంచి 20 వరకు ప్లీనరీ నిర్వహిస్తామన్నారు. అశ్వారావుపేట మండలంలో జరిగే జనసమితి సదస్సుకు కోదండరాం హాజరు అవుతారని తెలిపారు. నాయకులు రవి, నాగేశ్వరరావు, సర్దార్ పాల్గొన్నారు.

6న పశువుల సంత వేలం

కారేపల్లి: కారేపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంకు సంబంధించిన ప్రాంగణంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే వారాంతపు పశువుల సంతను సెప్టెంబర్ 6న వేలం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ నల్లమోతు శేషయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు సెప్టెంబర్ 4వ తేదీలోపు రూ.500లు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వేలం రోజు రూ.50వేలు డీడీ లేదా నగదును పూచికత్తు కింద జమ చేసి వేలంలో పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాలకు ఆలయ జూనియర్ అసిస్టెంట్ మోహన్‌చౌహాన్ ఫోన్‌నంబర్ 99892 57240ను సంప్రదించగలరని ఆయన కోరారు.

రుణమాఫీ తంటాలు..


చిరుమర్రి రైతువేదికలో ఏఈఓకి వినతిపత్రాలు అందజేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు(ఫైల్)

- ప్రభుత్వం నుంచి రాని స్పష్టత
- రుణాల కోసం ఎదురు చూస్తున్న రైతులు
- బ్యాంకుల చుట్టు ప్రదక్షిణలు

ముదిగొండ: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయటంతో తిరిగి డబ్బులు తీసుకునేందుకు రైతులు బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరి రైతులకు డబ్బులు ఖాతా జమ అయినప్పటికీ ఇచ్చేందుకు బ్యాంకర్లు కొర్రీలు పెడుతూ జాప్యం చేస్తున్నారు. ఇక మూడు విడతల్లో మాఫీ కానివారు బ్యాంకులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతు వైదికల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

సర్వే చేపట్టిన అధికారులు..

మూడు విడతల్లో మాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులను వ్యవసాశాఖ అధికారులు, ఏఈఓలు స్వీకరిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.2 లక్షలపైగా ఉన్న రైతులు దరఖాస్తులపై ఎలాంటి అనుమతులు రాలేదు. పూర్తిగా స్పష్టత రాకపోవడంతో తీసుకున్న రుణాలు చెల్లించలేక, తిరిగి రుణాలు పొందలేకపోతున్నారు. ఈ విషయమై రైతు సంఘం నాయకులు, ప్రతిపక్షాలు రోడ్లెక్కి ధర్నాలు, రాస్తారోకోలు చేసినా ఫలితం లేకపోయింది. రేషన్‌కార్డులు రుణ మాఫీకి ప్రమాణికంగా తీసుకున్న ప్రభుత్వం ఒక్కో కుటుంబంలో ఇంత వరకు రేషన్‌కార్డు లేనివారు చాలా మంది ఉండడంతో ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ అధికారులు ప్రత్యేక యాప్‌ద్వారా గ్రామాల్లో రైతుల రేషన్ కార్డులు, ఆధార్ కార్డుల ద్వారా సర్వే చేపడుతున్నారు.

అయోమయంలో రైతులు..

రైతులకు రుణాల విషయంలో ప్రభుత్వం, బ్యాంకర్లు, వ్యవసాధికారులు పెడుతున్న కొర్రీలతో రైతులు విసిగిపోతున్నారు. రెండు లక్షలపైగా అప్పులున్న వారి పరిస్థితిపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో అయోమయంలో పడ్డారు. త్వరితగతిన రుణమాఫీని అమలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు.

షరతులు విధించొద్దు..



రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణాలు అమలుచేయాలి. రైతుల పెట్టుబడులు, ఎరువులు, కూలీల ఖర్చులతో సతమతమవుతుండగా.. ప్రభుత్వ నింబంధనలతో బ్యాంకర్లు, నానా రకాల కొర్రీలు పెడుతున్నారు. రూ.2లక్షలపై బడిన రైతులకు ఏకకాలంలో రుణాలు మాఫీ చేసి తిరిగి రుణాలు ఇవ్వాలి. – కోలేటి ఉపేందర్‌రావు, రైతు సంఘం మండల కార్యదర్శి, చిరుమర్రి

రుణమాఫీ కాలేదు..



నేను రూ.70 వేలు పంట రుణం తీసుకున్నాను.. కానీ నాపేరు రుణమాఫీ లిస్టులో లేదు. వ్యవసాయ అధికారులను కలిసి దరఖాస్తు చేసినా ఇంతవరకు అతీగతి లేదు. పేరుకే రైతుల రుణమాఫీ, అందరికీ రుణాలు అమలు చేస్తే మంచిది. రుణమాఫీ చేస్తే కొంత ఆర్థిక భారం తగ్గుతుంది. ఇకనైనా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవాలి. – కె.వెంకటనారాయణ, రైతు, మేడేపల్లి

కుటుంబ నిర్ధారణ సర్వేను వేగవంతం చేయండి


మధిర: సర్వేను పరిశీలిస్తున్న ఏడీఏ విజయచంద్ర

మధిర/బోనకల్/చింతకాని: మధిరలోని మడుపల్లిలో, బోనకల్‌లో, చింతకానిలోని మత్కేపల్లిలో వ్యవసాయ అధికారులు నిర్వహిస్తున్న రేషన్ కార్డు లేని రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమాన్ని శుక్రవారం ఏడీఏ ఎస్.విజయచంద్ర పరిశీలించారు. మడుపల్లిలో నిర్వహించే సర్వేలో మొత్తం 312 రైతు కుటుంబ సభ్యులకు గాను 250 మంది రైతు కుంటుంబాల నిర్ధారణ చేశారు. అదే విధంగా బోనకల్‌లో 125 రైతు కుటుంబ సభ్యులకు గాను 79 మందికి నిర్ధారణ సర్వే నిర్వహించారు. నేడు రామాపురం, గార్లపాడు జీపీల్లో సర్వే ఉంటుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చింతకాని మండలంలో సుమారు 1,465 మంది రైతులు ఉండగా.. ఇప్పటివరకు నాగిలిగొండ, కోమట్లగూడెం, నేరడ, మత్కేపల్లి, జగన్నాథపురం గ్రామాల్లోని సుమారు 200 మంది రైతుల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేశామని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. రేషన్ కార్డు లేని రైతులు ఆయా గ్రామాల్లో ధ్రువీకరణ పత్రంతో పాటు కుటుంబ సభ్యుల ఆధార జిరాక్స్‌లు, లోన్ అకౌంట్ జిరాక్స్‌లు, పట్టాదారు పాస్‌బుక్ నకళ్లు వంటి వివరాలతో మండల వ్యవసాయ అధికారిని గాని, వ్యవసాయ విస్తరణ అధికారులను గాని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమాలల్లో ఏఓలు శ్రీనివాసరావు, పల్లెల నాగయ్య, బాస్కర్‌రెడ్డి, ఏఈఓలు జిష్ణు, అమృత, ప్రవల్లిక, రజిత, మరీదు త్రివేణి, గోగుల హరికృష్ణ, నవీన్, అయేషా ఫాతిమా, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రుణమాఫీ సర్వే..

వేంసూరు/తల్లాడ: మండలంలోని అడసర్లపాడులో నిర్వహిస్తున్న సర్వేలో.. మండల వ్యవసాయ అధికారి రామ్మోహన్ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అదే విధంగా తల్లాడలోని నూతనకల్ గ్రామంలో ఏఓ తాజుద్దీన్ సర్వే నిర్వహించారు. ఇప్పటివరకు 180మంది దరఖాస్తులు స్వీకరించి.. యాప్‌లో అప్‌లోడ్ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు త్రివేణి, మాధవి, సాయికుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి రైతులు పాల్గొన్నారు.

కేన్సర్ నిర్ధారణ వైద్యశిబిరం


ఎర్రుపాలెం: పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి శశిపూర్ణ

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని కమ్మ కల్యాణ మండపంలో శుక్రవారం హైదరాబాద్ కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్, ఖమ్మం ఎన్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్, కమ్మజన సేవా సమితి, బోడేపూడి వైద్యశిబిరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కేన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రి, రీచెర్స్ కేంద్రం వైద్యులు, సంచార వ్యాధి నిర్ధారణ సిబ్బంది పాల్గొని పరీక్షలు నిర్వహించారు. కేన్సర్ నిర్ధారణ అయిన వారికి ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా హైదరాబాద్‌లోని బసవతారకం ఆస్పత్రిలో చికిత్స అందించనున్నట్లు తెలిపారు. అంతకు ముందు వైద్యశిబిరాన్ని కమ్మ జన సేవా సమితి సీనియర్ నాయకుడు అడపా అప్పారావు, కాకతీయ కమ్యూనిటీ చైర్మన్ గడూరు సత్యనారాయణ ప్రారంభించారు. విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, బొంతు రాంబాబు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, వీరభద్రం, కృష్ణార్జున్‌రావు, సమత, నాగేశ్వరరావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కండ్రికలో ఉచిత వైద్యశిబిరం

ఎర్రుపాలెం: మండలంలోని కండ్రికలో శుక్రవారం బనిగండ్లపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో వైద్యురాలు శశిపూర్ణ పాల్గొని 66మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, పాల్గొన్నారు.

చింతకాని మండలంలో..

చింతకాని: మండలంలోని బొప్పారం, లచ్చగూడెం గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. అలాగే గ్రామాల్లో చేపట్టిన డ్రైడే కార్యక్రమాలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ ఆల్తాఫ్, పల్లె దవాఖాన డాక్టర్ వెంకటేశ్వర్లు, భవ్య, సీహెచ్ఓ వీరేందర్, హెల్త్ సూపర్‌వైజర్లు నాగేశ్వరరావు, రేఖల్‌రాణి, ఏఎన్ఎంలు పద్మ, సంధ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తెలగవరంలో..

పెనుబల్లి: మండలంలోని తెలగవరంలో లంకాసాగర్ పీహెచ్‌సీ వైద్యుడు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ఇంటింటి ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ శ్రీనివాసరావు, పీహెచ్ఎన్ సుగుణదేవి, సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, బషీర్ రుద్దీన్, పొట్టమ్మ, కరీముల్లా, రవి తదితరులు పాల్గొన్నారు.


నేడు ఉచిత కంటి వైద్యశిబిరం..

ఖమ్మం మమత జనరల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, వీయంబంజర్ రాజసాయి మందిరం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు జెన్నారెడ్డి నరసింహారెడ్డి తెలిపారు. ఆగస్టు 31న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పెనుబల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు, మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో ఉచితంగా మందులు అందజేయబడతాయని, కంటి శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించబడతాయని తెలిపారు.

'సాయిస్ఫూర్తి' కళాశాలలో ఇండక్షన్ ప్రోగ్రాం

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ మొదటి సంవత్సరం అన్ని బ్రాంచ్‌ల విద్యార్థులకు శుక్రవారం ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా ప్రముఖ సైకాలజిస్ట్ పి.విజయలక్ష్మి మోటివేషనల్ క్లాస్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రమబద్ధమైన శిక్షణ, కళాశాల లక్ష్యాలకు సంబంధించిన క్రమబద్ధమైన జోక్యంతో సహజన అభ్యాసాన్ని భర్తీ చేస్తుందని, ప్రతి విద్యార్థి విజన్ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శేషారత్నకుమారి, సైన్స్‌అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ మీరాసాహెబ్, అన్ని బ్రాంచ్‌ల విభాగాధిపతులు, ఫ్యాకల్టీ మెంబర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

రెబ్బవరం హైస్కూల్‌లో 'అవ్వా తాతలకు ఉత్తరాలు'


ఉత్తరాలు రాసిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం ఉన్నత పాఠశాలలో పత్తిపాక ఫౌండేషన్ గరిపల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో చొక్కాపు వెంకటరమణ 75వ పుట్టిన రోజు సందర్భంగా బాల సాహిత్యాన్ని ప్రోత్సహించే ఉద్దేశ్యంతో 'అవ్వా తాతలకు ఉత్తరాలు'రాసే కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించగా.. 30మంది విద్యార్థులు ఉత్తరాలు రాశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ప్రీస్కూల్ కార్యక్రమాలు


మాట్లాడుతున్న సీడీపీఓ ఎన్.కనకదుర్గ

సత్తుపల్లిరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని సత్తుపల్లి సీడీపీఓ ఎన్.కనకదుర్గ అన్నారు. శుక్రవారం మండలంలోని తొగ్గూడెం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన సెక్టార్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రీస్కూల్ కేంద్రాల్లో సమయపాలన పాటించాలని, పిల్లల హాజరు శాతం పెంచాలన్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఫౌండర్స్ డే


నివాళులర్పిస్తున్న దృశ్యం

వైరా: స్థానిక మేరీ ఇమ్మాక్యులేట్ పాఠశాలలో శుక్రవారం ఫౌండర్స్ డేను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ మీనా, హెచ్ఎం సిస్టర్ యమున ఆధ్వర్యంలో పాఠశాల స్థాపించిన బిషప్ మోరో వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఆయను నివాళులర్పించి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిస్టర్స్ బేన్నెట్, ప్రదీప, సౌజన్య, జేస్సింత, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సరస్వతి విగ్రహం వితరణ


సరస్వతి విగ్రహం వద్ద ఉపాధ్యాయులు, గ్రామస్తులు

కొణిజర్ల: మొదటి సారిగా ఉపాధ్యాయుడిగా పనిచేసిన పాఠశాలకు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సరస్వతి విగ్రహాన్ని అందించాడు. ఖమ్మంకు చెందిన గోళ్లమూడి మల్లికార్జున శర్మ పెద్దగోపతిలో మొదటి పోస్టింగ్ ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. అతను అందించి సరస్వతి విగ్రహాన్ని పాఠశాల విద్యార్థులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం మార్క్, గ్రామ పెద్దలు నారాయణరావు, చిన్నపుల్లయ్య, నరసయ్య, పీఎస్ హెచ్ఎం నర్సింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు..

తల్లాడ: తల్లాడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని మల్సూర్‌తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఒకటి నుంచి 5 తరగతుల విద్యార్థులకు నోట్ పుస్తకాలతో పాటు, పెన్నులు, పలకలు, బలపాలు అందించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు మాట్లాడారు. కార్యక్రమంలో కోశాధికారి శీలం వెకట్‌రెడ్డి, యాచవరపు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృథా ఖర్చులు తగ్గించండి..


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లిటౌన్: వృథా ఖర్చులు తగ్గించి పట్టణాభివృద్ధికి కృషి చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. శక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ కూసంపూడి మహేష్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. డెంగీ, మలేరియా విష జ్వరాలపై అప్రమత్తం కలిగించేందుకు వార్డుల్లో ప్రజలకు అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు మంచినీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలని ఆదేశించారు. మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతుల కోసం తరచూ గోతులు తీయటం వల్ల రహదారులు దెబ్బతింటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా.. మోటార్ల రిపేర్లకే ఎక్కువ ఖర్చులు చూపిస్తున్నారని, తరచూ పెట్టే మరమ్మతు ఖర్చుల కంటే కొత్త మోటార్లు వస్తాయని పలువురు కౌన్సిలర్లు పేర్కొన్నారు. పలుచోట్ల కుక్కకాటుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపాలిటీలోని 70 షాపులకు 33శాతం అద్దె పెంచుతూ తీర్మానాన్ని ప్రవేశ పెట్టగా.. పలువురు కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. షాపులకు కొత్త టెండర్లు పిలవాలని కోరగా.. షాపుల యజమానులు జీఓ తెచ్చుకున్నారని ఆ నిబంధనలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని చైర్మన్ కూసంపూడి మహేష్ తెలిపారు. మొక్కల సంరక్షణకై రూ.2 లక్షల ఖర్చు చూపించారని, సంరక్షణ చర్యలను పడక్బందీగా చేపట్టాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ మైసా శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ తోట సుజలరాణి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

తక్షణమే రోడ్డుకు మరమ్మతు చేయించండి..

సత్తుపల్లి: వర్షాలకు రోడ్లన్నీ గోతులుపడి దెబ్బతిన్నాయని.. వీటిని వెంటనే మరమ్మతుపనులు చేయించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని రింగ్‌సెంటర్ ప్రాంతంలో మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతుల వల్ల దెబ్బతిన్న రోడ్డు, గుంతలను పరిశీలించారు. వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడకుండా రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి


సత్తుపల్లి: మాట్లాడుతున్న ఏసీపీ రఘు


వైరా: మాట్లాడుతున్న ఏసీపీ రెహమాన్

సత్తుపల్లి/వైరా/కారేపల్లి: గణేష్ నవరాత్రుల ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఏసీపీలు ఎం.ఏ రెహమాన్, ఎ.రఘు, సీఐ తిరుపతిరెడ్డి తెలిపారు. శుక్రవారం వైరాలోని పోలీస్‌స్టేషన్‌లో, సత్తుపల్లిలో, కారేపల్లి పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. గణేష్ మండపాలు ఏర్పాటు చేసేవారు పోలీస్ అనుమతి తీసుకోవాలన్నారు. డీజే వంటి లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయొద్దని.. వినాయక చవితి నుంచి నిమజ్జనం చేసే వరకు ఎటువంటి అవంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై తప్పనిసరిగా చర్యలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో సత్తుపల్లిటౌన్, సత్తుపల్లిరూరల్ సీఐలు టి.కిరణ్. ముత్తిలింగం, వైరా సీఐ నునావత్ సాగర్, ఎస్సైలు వంశీకృష్ణ భాగ్యరాజ్, సూరజ్, నాగుల్‌మీరా, ఎస్.రాజారాం, ఎఎస్సై నాగ రాజకుమారి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి


నిరసన చేస్తున్న యూటీఎఫ్ నాయకులు, గురుకులాల ఉద్యోగులు

మధిరరూరల్: ప్రభుత్వ ఉద్యోగుల పట్ల గుదిబండగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం మధిర పట్టణంలోని గురుకుల పాఠశాలలను సందర్శించి మాట్లాడారు. 2023 జూలై నుంచి పీఆర్సీ అమలు చేయాలన్నారు. సెప్టెంబర్ ఒకటిన పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా జిల్లాలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

వంద పడకల ఆస్పత్రిని కొనసాగించండి


భట్టి విక్రమార్కకు వినతి అందజేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: వైరా నియోజకవర్గ కేంద్రంలో ఇటీవల డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేసిన 100 పడకల ఆస్పత్రిని 50 పడకలుగా అధికారులు మార్చడంతో చర్చనీయాంశమైంది. శుక్రవారం ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సెక్రటేరియేట్‌లోని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి సమస్యను వివరించగా.. భట్టి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. అంతేకాకుండా మున్సిపాలిటీ, నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విన్నవించగా.. ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

మహాలక్ష్మి పథకం అమలుచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న లతాదేవి

బోనకల్: తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఒకటైన మహాలక్ష్మి పథకాన్ని అమలుచేసి ప్రతినెల రూ.2,500 ఇవ్వాలని భారత జాతీ య మహిళ సమైఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి లతాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతితో కలిసి ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలుపరచాలని కోరారు. కార్యక్రమంలో సమైఖ్య మండల నాయకురాలు రేణుక, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి పూజలు


వైరా: కుంకుమ పూజ చేస్తున్న భక్తులు


మధిర: పూజలు చేస్తున్న శీలం వెంకటరెడ్డి దంపతులు

వైరా: శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా వైరాలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో వరలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించగా.. మహిళలు పూజ కార్యక్రమాల్లో పాల్గొని కుంకుమ పూజలు చేశారు. ఆలయ అధ్యక్షుడు పాడపాటి నాగేశ్వరరావు, బోసు, సుబ్బారావు పాల్గొన్నారు.

సంతగుడిలో..

కారేపల్లి: కారేపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం (సంతగుడి)లో మహిళా భక్తులు సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు వలివేటి సురేందర్ శర్మ, సతీష్ శర్మల మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ మేనేజర్ నల్లమోతు శేషయ్య, ఆలయ సిబ్బంది మోహన్ చౌహాన్ తదితరులు పర్యవేక్షించారు.

భరత్ కిడ్స్ అండ్ టెక్నో స్కూల్‌లో..

మధిర: శ్రావణమాసంలో చివరి శుక్రవారం కావడంతో భరత్ కిడ్స్ అండ్ టెక్నో స్కూల్‌లో.. ఆ సంస్థ అధినేత శీలం వెంకటరెడ్డి, డైరెక్టర్ విద్యాలత దంపతులు పాల్గొని లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఉమాదేవి, స్రవంతి, కోటేశ్వరరావు, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మహిళా భక్తులు సామూహిక వరలక్ష్మి వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, శివరాంప్రసాద్, వెంకట్రావ్, రామకృష్ణ, కార్తీక్ పాల్గొన్నారు.

గాజుల అలంకరణలో..

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని రాజీవ్‌నగర్ శ్రీవిజయదుర్గ అయ్యప్ప ఆలయంలో అమ్మవారిని భక్తులు గాజులతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు.


సత్తుపల్లిలో..


కారేపల్లి: సంతగుడిలో..